క్లుప్తంగా

వినాయక గుడిలో అన్నదానం



తెనాలిటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని రామ మందిరంలో వసంత నవరాత్రి మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. రామ మందిరంలో 48వ సంవత్సరం సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా వినాయకగుడి ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. రామ మందిరం నిర్వాహకులు కన్నెగంటి గోపిచంద్, మాణిక్యాలరావు, కంచి రాంబాబు, దంతాల ఆంజనేయులు, తోట భానుమూర్తి, పొన్నం విజయకుమార్, కన్నెగంటి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

9న రసధ్వని పుస్తకావిష్కరణ

తెనాలి: కళాతపస్వి సంజీవదేవ్ సాహిత్యం–జీవితంపై తాజాగా వెలువరించిన 'రసధ్వని' పుస్తకాన్ని ఈనెల 9న తెనాలిలో ఆవిష్కరించనున్నారు. ఈ పుస్తకాన్ని ప్రఖ్యాత రచయిత శ్రీరమణ, ఎన్ఆర్ తపస్వి, వెనిగళ్ల వెంకటరత్నం సంకలనం చేశారు. డాక్టర్ సంజీవదేవ్ ఫౌండేషన్, తెనాలి ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగే సభకు ప్రజాసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహిస్తారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని, చైతన్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ వక్తలుగా వ్యవహరిస్తారని ఫౌండేషన్ కార్యదర్శి వైపీ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పత్రాలు లేని వాహనాలకు జరిమానా



తెనాలిరూరల్: తెనాలి–గుంటూరు వయా నారాకోడూరులోని క్వారీల వద్ద రవాణా శాఖ అధికారులు సోమవారం సాయంత్రం వాహన తనిఖీలను చేపట్టారు. తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 16 మంది ద్విచక్రవాహనదారుల వద్ద సరైన పత్రాలు లేనట్టు గుర్తించి సుమారు రూ.90 వేల వరకు జరిమానాలు విధించారు. వాహనదారులు సీ బుక్ లైసెన్సుతోపాటు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని రాఘవరావు సూచించారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

కొల్లిపర: స్థానిక పాలకేంద్రం కల్యాణ మండపంలో మంగళవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొల్లిపర, చివలూరు, అన్నవరం, అన్నవరపులంక, బొమ్మువానిపాలెం, చక్రాయపాలెం, చెముడుబాడు, హన్‌మాన్‌పాలెం, సిరిపురం, తూములూరు, దావులూరు, దావులూరిపాలెం గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత మెగా చెక్కు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో పి.శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

అత్తపై అల్లుడి దాడి

తెనాలిరూరల్: అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఐతానగర్ లంకదిబ్బ ప్రాంతానికి చెందిన రవి తన భార్యతో ఘర్షణ పడుతుండడంతో అతని అత్త నాగమ్మ వెళ్లింది. అదేంటని ప్రశ్నించిన ఆమెపై రవి దాడి చేశాడు. నాగమ్మ మెడపై గాయమైంది. నాగమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు టూ టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు.

అగ్నిపరీక్ష

- తెనాలి అగ్నిమాపక కార్యాలయంలో సమస్యల సెగ
- పురాతన భవనంలోనే విధులు
- మధ్యలోనే ఆగిన కొత్త కార్యాలయ నిర్మాణం
- సిబ్బంది కొరతతో సతమతం
- ఎనిమిది మండలాలకు ఒక్కటే శకటం దిక్కు
- మిస్ట్ వాహనంతో కొంత ఉపశమనం



తెనాలిలోని అగ్నిమాపక కార్యాలయం

తెనాలి రూరల్: స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయం సమస్యలతో సతమతమవుతోంది. అరకొర వసతులు, సిబ్బంది కొరతతో అగ్నిపరీక్షను ఎదుర్కొంటోంది. ఎప్పుడో స్వాతంత్య్రం రాక ముందు నిర్మించిన కార్యాలయంలోనే మగ్గుతోంది. ఇక్కడ నలుగురుకన్నా ఎక్కువ మంది సిబ్బంది కూర్చునే వీలు లేదు. వాన వచ్చిందంటే కార్యాలయం తటాకాన్ని తలపిస్తుంది. శ్లాబు నుంచి నీరు కుండపోతగా కారుతుంది.

పది పోస్టులు ఖాళీ

తెనాలి అగ్నిమాపక కార్యాలయం పరిధిలో ఎనిమిది మండలాలు ఉంటాయి. మొత్తం 31 మంది సిబ్బంది ఇక్కడ అవసరం. వీరిలో అగ్నిమాపక అధికారితోపాటు ఫైర్‌మెన్‌లు, నలుగురు లీడింగ్ ఫైర్‌మెన్, ఐదుగురు డ్రైవర్లు ఉండాలి. ప్రస్తుతం 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

'మిస్ట్'.. బెస్ట్

తెనాలి అగ్నిమాపక శాఖ కార్యాలయానికి అత్యాధునిక మిస్ట్ వాహనాన్ని కేటాయించారు. చిన్నచిన్న సందుల్లోని ఇళ్లు, దుకాణాలు తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఈ వాహనం త్వరగా అక్కడికి చేరుకుని, మంటలను అదుపు చేస్తుంది. వాహనంలో ఉన్న సిలిండర్ల ద్వారా నీరు, ఫోంను వెదజల్లి మంటలను అరికడతారు. ఈ వాహనం వల్ల కొంత ఊరట లభిస్తోంది. అయితే పెద్ద ప్రమాదాలు సంభవిస్తే ఇది మంటలను అదుపుచేయలేదు.

కొత్త భవన నిర్మాణం చేపట్టినా..

తెనాలిలో కొత్త కార్యాలయ నిర్మాణం కోసం సిబ్బంది పదేపదే అర్జీలు పంపడంతో ఉన్నతాధికారులు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జీ ప్లస్ టూ విధానంలో రెండంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు. దీనికోసం సుమారు రూ. కోటి వ్యయమవుతుందని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు అంచనా వేసి, మంజూరు చేశారు. గుంటూరుకు చెందిన కాంట్రాక్టరు పనులను దక్కించుకున్నారు.



పునాది దశలోనే నిలిచిన కొత్త కార్యాలయ నిర్మాణం

2018లో పనులను ప్రారంభించారు. పునాదుల వరకు సుమారు రూ.22 లక్షల విలువైన పనులు చేశారు. అప్పట్లో బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరు పనులను వదిలేసి వెళ్లిపోయారు.

విధి నిర్వహణలో లోపం లేదు



కార్యాలయంలో ఇబ్బందులు ఉన్నా విధి నిర్వహణలో లోపం లేకుండా శాయశక్తులా పనిచేస్తున్నాం. ఉన్న సిబ్బందినే సమన్వయం చేసుకుంటూ మంటలను అదుపు చేస్తూ ప్రమాదాలను నివారిస్తున్నాం. మెరుగైన సేవలు అందించేందుకు ప్రతిక్షణం తపిస్తున్నాం. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు మా కార్యాలయానికి 128 కాల్స్ వచ్చాయి. ఈ కాలంలో జరిగిన ప్రమాదాల్లో రూ.1,02,24,000 విలువైన ఆస్తి నష్టం సంభవించింది. రూ.6,18,65,000 విలువైన ఆస్తులను కాపాడాం.

– కె.కృష్ణారెడ్డి, అదనపు జిల్లా అగ్నిమాపకాధికారి, తెనాలి

ఒకేసారి రెండు ప్రమాదాలు జరిగితే..!



పని చేయని శకటం

తెనాలి అగ్నిమాపక కార్యాలయంలో రెండు శకటాలు ఉండేవి. ఒకటి మూలనపడడంతో రవాణాశాఖ అధికారులు పరిశీలించి ఇక పనికి రాదని తేల్చారు. ప్రస్తుతం ఎనిమిది మండలాలకు ఒకటే శకటం దిక్కయింది. ఒకేసారి రెండు ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం వేసవి సమీపిస్తున్నందున మరో శకటాన్ని కేటాయించాల్సిన అవసరం ఉంది.

60 మందికి వైఎస్సార్ కంటివెలుగు పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పరీక్షలు నిర్వహించారు. కంటివైద్య నిపుణులు రోజారాణి మాట్లాడుతూ అవ్వా,తాతలు 60 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారిలో 40 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామన్నారు. పదిమందికి కంటిచుక్కలు మందు వేసి, మందులు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన పదిమందిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించుకునేందుకు రిఫర్ చేసినట్లు తెలిపారు. డాక్టర్ యానిగ్రేస్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో అన్నదానం

మంగళగిరి: నగరంలోని బాపనయ్యనగర్‌లో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఐదవ రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కోలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాటక కళాకారుడు రత్తయ్యకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం పరువు ప్రతిష్ట చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం గుడిగంటలు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు అద్దంకి రత్తయ్యను సన్మానించారు. కార్యక్రమంలో తాడిబోయిన హరిప్రసాద్, పినపాటి రవీంద్ర, సోమవరపు సాంబశివరావు, చందు హేమంత్, వినుకొండ శ్రీరామమూర్తి, పెమ్మసాని పోతురాజు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, ఫణిదపు దుర్గ, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, కృష్ణారావు, మధు తదితరులు పాల్గొన్నారు.



రత్తయ్యను సన్మానిస్తున్న హరిప్రసాద్, రవీంద్ర తదితరులు

పోషకాల గని చిరుధాన్యాలు

తాడేపల్లిరూరల్: పోషకాల గని చిరుధాన్యాలు అని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. సోమవారం దుగ్గిరాల గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్లేశ్వరి మాట్లాడుతూ చిరుధాన్యాలు నేటితరం వారికి అందజేస్తే భావితరం ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. మహిళలకు చిరుధాన్యాలు, వాటి పోషక విలువలను వివరించారు. కొర్రలు, రాగులు, జొన్నలు తదితర చిరుధాన్యాలు మన నిత్య ఆహారంలో ఉండేలా చూసుకోవాలని అన్నారు. సమతుల ఆహారం పిల్లలకు అందించకపోవడం వల్ల పిల్లలు ఎత్తుకు దగ్గ బరువు లేకుండా బలహీనంగా ఉంటారని అన్నారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన వంటకాలను ప్రదర్శించి పంపిణీ చేశారు. ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఎంపీటీసీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, దుగ్గిరాల సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తల్లులకు చిరుధాన్యాలతో చేసిన పదార్థాలను అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు

మంగళగిరి: నగర పరిధిలోని పలువురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తోపుడు బండ్లను అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటా పర్యటించిన సందర్భంలో నగరానికి చెందిన గజం రాజు, బొబ్బా హనుమంతరావు, సుబ్బారావు అనే చిరువ్యాపారులు తమకు తోపుడు బండ్లు కావాలని, రోజుకు రూ.30 నుంచి రూ.50లు చొప్పున అద్దెకు తెచ్చుకుని కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు విక్రయించుకుంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఎదుట చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ నాయకులు తోపుడు బండ్లను అందజేశారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, సంకా బాలాజీ గుప్తా, నేరెళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

హెలికాప్టర్ రైడ్, ట్రావెల్ ఇన్సూరెన్స్ పేరిట మోసం

తెనాలిరూరల్: దైవ దర్శనానికి వెళ్ళేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న వ్యక్తిని హెలికాప్టర్ రైడ్, ట్రావెల్ ఇన్సూరెన్స్ పేరిట బురిడీ కొట్టించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వైద్యుడు నందిపాటి శ్రీకాంత్ జమ్ము కాశ్మీర్‌లోని వైష్ణో దేవి ఆలయానికి వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్నారు. ఈ ప్రయాణానికి సంబంధించి ట్రావెల్ ఇన్సూరెన్స్, హెలికాప్టర్ రైడ్ ఏర్పాటు చేస్తామంటూ గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుంచి కాల్ వచ్చింది. వారి మాటలు నమ్మి రూ.33వేలు వారి ఖాతాకు శ్రీకాంత్ బదిలీ చేశారు. తిరిగి ఎటువంటి సమాధానం లేక పోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వన్‌టౌన్ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలు కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని పలువురు బాధితులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని సోమవారం బాధిత కుటుంబాలకు దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామం, ఎస్సీ కాలనీకి చెందిన కనపాల పాములు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబానికి ఎమ్మెల్యే సానుభూతిని ప్రకటించి, రూ.15వేలు, వల్లూరు రవికుమార్ కుటుంబానికి మరో రూ.15 వేలు, పులివర్తి రామయ్య కుటుంబానికి రూ.15 వేలు, పక్షవాత బాధితుడు పెంద్యాల యాకోబు కుటుంబానికి రూ.15 వేలు, క్యాన్సర్ బాధితురాలు చొప్పర కుమారికి రూ.10 వేలు, మరో క్యాన్సర్ బాధితురాలు చొప్పర రత్నకుమారికి రూ.15 వేలు, మొత్తం రూ. 85 వేలను అందజేశారు.

జిల్లా వైద్యశాలలో సమస్యలు పరిష్కరించండి

తెనాలిఅర్బన్: జిల్లా వైద్యశాలలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆర్ఎంవో డాక్టర్ మస్తాన్‌వలీని సోమవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. స్కానింగ్ కోసం గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రోగులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంలో అధికారులు విఫలమైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి బిళ్ళ రాజేష్, నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, సీపీఐ తెనాలి కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు సాయి, శ్రీను, శ్రీకర్, కొండ, ఎం.శివ, రవితేజ, అశోక్, నాగేంద్ర పాల్గొన్నారు.



ఆర్ఎంఓ డాక్టర్ మస్తాన్‌వలీకి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

గీత కార్మికునికి తీవ్ర గాయాలు

కొల్లిపర: తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి గీత కార్మికునికి తీవ్రగాయాలైన ఘటన కొల్లిపరలో ఆదివారం సాయంత్రం జరిగింది. కొల్లిపరకు చెందిన బొర్రా నాంచారయ్య(42) రోజులానే కల్లుగీయటానికి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ జారి చెట్టుపై నుంచి కింద పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే నాంచారయ్యను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కూడా సరైన వైద్యం అందకపోవటంతో నాంచారయ్యను మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ భీమవరపు పద్మావతి, భీమవరపు సంజీవరెడ్డి , ఎంపీడీవో పి.శ్రీనివాసులు సోమవారం నాంచారయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దృష్టికి తీసుకువెళ్ళి ప్రభుత్వ పరంగా నాంచారయ్యను ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



గీత కార్మికుడు నాంచారయ్య

కేఎల్‌యూలో మాక్ పార్లమెంట్

తాడేపల్లిరూరల్: భారత పార్లమెంట్ వ్యవహారాల గురించి, ప్రస్తుత రాజకీయాల గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని కేఎల్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ విభాగ అధిపతి డాక్టర్ వెంకటేశ్వర కుమార్ అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆర్ట్ కళాశాల విద్యార్థులకు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాజనీతి శాస్త్రంలో ఆయా విభాగాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మనది అని అన్నారు. అనంతరం మాక్ పార్లమెంట్‌లో 'రైట్ టు రీకాల్' అనే అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య చర్చ జరిగింది. బీఏ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జి.ఉదయకుమార్ స్పీకర్‌గా, ప్రధానిగా బీఏ మూడో సంవత్సరం విద్యార్థిని కుమారి తెనాలి అపూర్వ, ప్రతిపక్ష నాయకుడిగా వెంకట నరేంద్ర వ్యవహరించారు. అఖిలపక్షాల చర్చల అనంతరం నూతన రైట్ టు రీకాల్ బిల్లును మాక్ పార్లమెంట్ ఆమోదించింది. భారత పార్లమెంట్‌ను తలపించేలా విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్‌ను తిలకించిన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు అభినందించారు.



మాక్ పార్లమెంట్‌కు వేదికగా మారిన బీఏ ఐఏఎస్ తరగతి గది

వీర్లపాలెంలో ప్రత్యేక ప్రార్థనలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామంలో శ్రీ యేసు నామ క్షేత్రం నందు సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వాహకుడు రావిపాటి ఈనాక్ శిరీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సికింద్రాబాద్, కింగ్‌డమ్ కమ్యూనిటీ చర్చి పాస్టర్ జి.కమల్ మాట్లాడుతూ సర్వమానవాళి సుఖశాంతులతో ఆనందంగా జీవించాలని, ఏసుక్రీస్తు అందరికీ రక్షణ కల్పిస్తాడని అన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దుగ్గిరాల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పున్న సురేష్‌బాబు పాల్గొన్నారు.

గణేశుడి విగ్రహం ధ్వంసం

ఫిరంగిపురం: ప్రసిద్ధి చెందిన గణేశుడి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని గణేశునిపాడుగ్రామ శివారు చెరువు కట్ట వద్ద సోమవారం తెల్లవారుజామున చేటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామశివారులోని చెరువుకట్ట మీదనున్న గణేశుడి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసంచేశారు.

దశ తిరిగేనులే



తెనాలిలో పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద వేచిఉన్న తల్లిదండ్రులు, విద్యార్థులు



హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థిని పరీక్ష సామగ్రిని తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయురాలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తెనాలిలోని పరీక్ష కేంద్రాలను డెప్యూటీ డీఈవో నిర్మల, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ పరిశీలించారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. హాల్‌టికెట్ నంబర్ల వారీగా కేటాయించిన గదుల జాబితాను చూసుకున్నారు. 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. తెనాలి పట్టణ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన 16 పరీక్ష కేంద్రాల్లో 3,208 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 3,184మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. కొల్లిపర మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 494 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 490 మంది హాజరయ్యారు.

–తెనాలిఅర్బన్/కొల్లిపర